


సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గురుకుల పాఠశాలలో పాడైన సోలార్ సిస్టం


హుస్నాబాద్ గిరిజన గురుకుల బాలుర ఆశ్రమ పాఠశాలలో దుప్పట్లు లేకుండానే నిద్రిస్తున్న విద్యార్థులు


గుర్రాలగొంది ఎస్సీ గురుకులంలో తలుపులు లేని కిటికీలకు అడ్డుగా దుప్పట్లు

చన్నీటి స్నానం..
చలితో సావాసం

- ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థుల వెతలు
- దుప్పట్లు పంపిణీ చేయకపోవడంతో చలితో ఇక్కట్లు
- ఉదయాన్నే చన్నీటి స్నానాలతో ఇబ్బందులు
- మంచాలు లేక నేలపైనే చిన్నారుల నిద్ర
- పలు గురుకులాల్లోనూ ఇవే సమస్యలు
- అధికారులు దృష్టిసారిస్తే విద్యార్థులకు ప్రయోజనం
- 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో అనేక సమస్యలు వెలుగులోకి..

'నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది ఎస్సీ గురుకుల పాఠశాలలో 507 మంది విద్యార్థులున్నారు. దుప్పట్లు, స్వెట్లర్లు పూర్తిస్థాయిలో ఇవ్వలేదు. భవనం కిటికీల అద్దాలు పగలడంతో చలి ప్రభావం తీవ్రంగా ఉంటున్నది. చలికి తాళలేక కిటికీలకు పాత దుప్పట్లు అడ్డుగా కట్టారు. ఇంటివద్ద నుండే దుప్పట్లు తెచ్చుకొని చలిని అధిగమించే ప్రయత్నం చేస్తున్నారు.'

'వర్గల్ మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు స్వెట్టర్లు పంపిణీ చేయలేదు. నిత్యం చన్నీటితోనే స్నానం చేస్తున్నారు. మరుగుదొడ్లకు తలుపులు లేవు. దోమలతో ఇబ్బంది పడుతున్నారు. ఇదే వర్గల్‌లోని ఎస్సీ హాస్టల్‌లోనూ ఓ వైపు చలి, మరోవైపు దోమల బెడద కారణంగా నిద్రపోవడం లేదని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.'

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట,నవంబరు24

ఆంధ్రజ్యోతి పరిశీలన

గుర్రాలగొంది, వర్గల్‌లో మాత్రమే కాదు... సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో ఇవే పరిస్థితులు దాపురించాయి. ఓ వైపు తీవ్రమైన చలి నెలకొన్నప్పటికీ అధికార యంత్రాంగం హాస్టళ్ల వైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలున్నాయి. ఫిర్యాదులు వస్తే తప్ప వారిలో చలనం ఉండడం లేదు. చలికాలంలో విద్యార్థులకు టంచన్‌గా రావాల్సిన దుప్పట్లు, రగ్గుల విషయంలోనూ

మిగతా 8వ పేజీలో...


ఎన్సాన్‌పల్లి గురుకుల హాస్టల్‌లో కిటికీలకు తలుపులు, మెష్ లేకపోవడంతో చలికి ఇబ్బంది పడుతూ నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు

తుది దశకు సమగ్ర సర్వే

- 3,25,759 కుటుంబాలకు.. 3.02 లక్షల కుటుంబాల సర్వే పూర్తి
- హైదరాబాద్‌లో ముగిసిన మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ
- ఆన్‌లైన్ నమోదుకు జిల్లా యంత్రాంగం సిద్ధం

సిద్దిపేట కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర సర్వే సిద్దిపేట జిల్లాలో చివరి దశకు చేరుకున్నది. కలెక్టర్ మనుచౌదరి పర్యవేక్షణలో అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా సర్వే ముమ్మరంగా సాగుతోంది. ఈనెల 9న ప్రారంభమైన సర్వే.. మరో రెండురోజుల్లో లక్ష్యాన్ని చేరుకోనున్నది. ఇప్పటివరకు జిల్లాలో 93 శాతం సర్వే పూర్తయింది. సర్వే పూర్తయిన వెంటనే కుటుంబాల వారీగా వివరాలను డేటా ఎంట్రీ చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. జిల్లాలోని పలు మండలాల్లో డేటా ఎంట్రీ నమోదు ప్రక్రియను ప్రారంభించారు.


ఆన్‌లైన్ నమోదుకు ఆపరేటర్లకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్లు

3.02 లక్షల కుటుంబాల్లో సర్వే పూర్తి

సిద్దిపట జిల్లాలో మొత్తం 3,25,759 కుటుంబాలు ఉండగా.. ఇప్పటివరకు 3.02 లక్షల కుటుంబాల సర్వే పూర్తయింది. మరో రెండురోజుల్లో వందశాతం లక్ష్యాన్ని చేరుకోనున్నది. వెంటనే వివరాలను డేటా ఎంట్రీ ఆన్‌లైన్ చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఇందుకు ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆనంద్‌తో పాటు మరో ఏడుగురు మాస్టర్ ట్రైనర్లతో ఇటీవల హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. జిల్లాలో తాత్కాలికంగా డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించుకుంటున్నారు. వీరికి మాస్టర్ ట్రైనర్లు మండలాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల్లో ఎన్యుమరేటర్లు ఇచ్చిన సర్వే వివరాలను ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభించారు.

విజయవంతంగా సర్వే



జిల్లాలో కుటుంబ సమగ్ర కులగణన సర్వే విజయవంతంగా సాగుతోంది. జిల్లాలో 93 శాతం సర్వే పూర్తిచేశాం. మరో రెండురోజుల్లో వంద శాతం పూర్తవుతుంది. ఇంటింటా సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఆపరేటర్లకు మాస్టర్ ట్రైనర్స్ ద్వారా శిక్షణ అందించాం. పలు మండలాల్లో డేటా ఎంట్రీ ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభించాం. సర్వే సమయంలో ఎక్కడ పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నాం.

- మనుచౌదరి, సిద్దిపేట కలెక్టర్

సర్వేపై నిర్లక్ష్యం వహిస్తే సహించం

- డేటా ఎంట్రీ పకడ్బందీగా చేయాలి
- అదనపు కలెక్టర్ అబ్దుల్‌హమీద్

తొగుట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కులగణన సర్వేపట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదని సిద్దిపేట అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అబ్దుల్‌హమీద్ హెచ్చరించారు. ఆదివారం తొగుట మండలం వెంకట్రావ్‌పేటలోని 134, 135 పోలింగ్ కేంద్రాల్లో చేపడుతున్న ఓటరు నమోదు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం తొగుట తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో చేపడుతున్న కులగణన సర్వే, డేటా ఎంట్రీ పనులను పరిశీలించారు. కుల, మత, జాతి గణన సర్వే పనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదన్నారు. డేటా ఎంట్రీలో తప్పులు లేకుండా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ అశోక్‌రాజ్, ఎంపీవో చందన, తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్ ఎల్లమ్మచెరువులో
భారీ కొండచిలువ



హుస్నాబాద్‌రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువులో చేపల కోసం వేసిన మత్స్యకారుల వలలో భారీ కొండచిలువ చిక్కింది. మత్స్యకారులు ఆదివారం ఉదయం చేపల కోసం చెరువులో వలవేశారు. వలలో కొండచిలువ చిక్కడంతో వారు ఒకింత భయాందోళనకు గురయ్యారు. వలను అమాంతం ఒడ్డుకు తీసుకొచ్చి ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సాజిత్ తమ సిబ్బందిని పంపించారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మహ్మద్ ఫరాద్, రెస్క్యూ టీం అబ్బాస్ సిబ్బందితో కలిసి వలలో నుంచి కొండచిలువను వేరు చేశారు. ఆ కొండ చిలువను అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి వదిలేస్తామని ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి మహ్మద్ ఫరాద్ తెలిపారు. చెరువులలో చిక్కిన కొండ చిలువను చూసేందుకు స్థానికులు భారీగా తరలివచ్చారు. అయితే, ప్రతిరోజు ఉదయం స్థానికులు వాకింగ్‌కు వెళ్లి ఈ చెరువులోనే ఈత కొడుతుంటారు. కొండచిలువ వలలో చిక్కిందన్న వార్త తెలియడంతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


సిద్దిపేటలో హాల్‌టికెట్ నంబర్ చెక్ చేసుకుంటున్న విద్యార్థులు

మెరిట్ స్కాలర్‌షిప్
పరీక్ష ప్రశాంతం

సిద్దిపేట కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ టెస్టు ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లాకు కేటాయించిన 1,877 మంది విద్యార్థుల్లో 1,823 మంది పరీక్షకు హాజరైనట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జిల్లావ్యాప్తంగా 97.12 హాజరు శాతం నమోదైనట్లు చెప్పారు. జిల్లాలో తొమ్మిది పరీక్ష కేంద్రాలకు గజ్వేల్ డివిజన్‌లో రెండు, హుస్నాబాద్ డివిజన్‌లో రెండు, సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఐదు సెంటర్లు ఏర్పాటు చేశారు. రెండు ఫ్లయింగ్ స్కార్డు బృందాలు, తొమ్మిది మంది సిట్టింగ్ స్కాడ్స్ పర్యవేక్షణలో పరీక్షలు జరిగినట్లు తెలిపారు.


పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థులు

లీజు డబ్బు వసూళ్లలో నిర్లక్ష్యమేలా?

- ఏడు నెలలు గడుస్తున్నా పట్టింపులేదు
- ఆలయ ఆదాయానికి గండి
- నెలరోజుల్లో మల్లన్న కల్యాణం

8



బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

- అక్క కోసం పసికందు కిడ్నాప్..
- అనంతపూర్ నుంచి వచ్చి నిలోఫర్ వద్ద ఎత్తుకెళ్లిన వైనం
- కర్నూల్ హైవేపై నిందితుల అరెస్ట్

7



కబ్జాపై కదిలిన కాలనీవాసులు

- రహదారి స్థలం అన్యాక్రాంతం కాకుండా అడ్డుకుని హద్దుల ఏర్పాటు

సంగారెడ్డి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఓ ప్రభుత్వ అధికారి రహదారి స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించగా కాలనీవాసులు అడ్డుకున్నారు. పట్టణంలోని తెలంగాణ టౌన్‌షిప్ పక్కన ఉన్న రాఘవేంద్రనగర్ కాలనీకి వెళ్లే 40 ఫీట్ల రోడ్డు ఇరువైపులా ఓ అధికారి ఆక్రమించారు. 65వ నంబరు జాతీయ రహదారి పక్కనే ఉన్న రాఘవేంద్రనగర్ కాలనీలో ఆయన ప్లాట్‌ను కొనుగోలు చేశారు. ఆ స్థలం పక్క నుంచి ఉన్న రహదారి స్థలాన్ని కబ్జా చేసి షెడ్డు నిర్మించారు. దీనిపై పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని, దీంతో రెచ్చిపోయిన అధికారి తన పలుకుబడిని ఉపయోగించి రహదారిపైనే విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయించారని కాలనీవాసులు తెలిపారు. దీంతో, ఆగ్రహించిన కాలనీవాసులు ఆదివారం ఎక్సవేటర్‌ను తీసుకువచ్చి సదరు అధికారికి చెందిన ప్లాట్ హద్దులు తెలిసేలా కాల్వను తవ్వించి, కబ్జాకు గురైన రహదారి స్థలాన్ని కాపాడారు. రోడ్డుపై ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని ట్రాన్స్‌కో ఎస్ఈకి ఫిర్యాదు చేస్తామని కాలనీ వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శశాంక్, బాలయ్య తెలిపారు.


రహదారి స్థలం హద్దులు తెలిసేలా కాల్వ తీయిస్తున్న కాలనీవాసులు

మా కులమేది..!

- కుల ధ్రువీకరణకు నోచని పిట్టల కులస్థులు
- సర్టిఫికెట్ లేక ఉద్యోగాలు వచ్చినా..నియామకాలు కాలే
- కల్యాణలక్ష్మికీ అనర్హత
- స్కూల్‌లో, కుటుంబ సర్వేలో ఖాళీగా కాలం

7 లో..



పెళ్లయిన రెండు వారాలకే
నవ వరుడి ఆత్మహత్య

రామచంద్రాపురం, నవంబరు 24: పెళ్లి జరిగిన 13 రోజులకే నవవరుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకున్నది. సీఐ జగన్నాథ్ వివరాల ప్రకారం.. గొట్టిముక్కల నర్సింహ(36) బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లో నివాసముంటున్నాడు. రామచంద్రాపురంలో ఓ షెట్టర్ అద్దెకు తీసుకుని వెల్డింగ్ దుకాణం నడుపుతున్నాడు. ఈ నెల 10న మహారాష్ట్ర షోలాపూర్‌కు చెందిన జయశ్రీతో వివాహం జరిగింది. పెళ్లి నాటి నుంచి దంపతుల మధ్య సంసార విషయంలో గొడవలు జరుగుతున్నాయి. జయశ్రీ 'తాను తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్తాను' అంటూ గొడవపడుతూ వస్తుంది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన నర్సింహ ఈ నెల 22న భార్యను వారి తల్లిదండ్రుల ఇంటి వద్ద దింపివచ్చాడు. గొడవ పడి భార్య పుట్టింట్లో ఉండిపోవడాన్ని జీర్ణించుకోలేక నర్సింహ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఆదివారం ఉదయం షాపులో పని ఉందని తల్లికి చెప్పి దుకాణానికి వెళ్లాడు. మధ్యాహ్నం భోజనానికి కొడుకు ఇంటికి రాకపోవడంతో తల్లి ఫోన్‌చేసింది. ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో చిన్న కుమారుడిని దుకాణానికి పంపింది. దుకాణంలో వైర్లతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతున్న నర్సింహను గుర్తించిన తమ్ముడు చుట్టుపక్కల వారి సహాయంతో మృతదేహాన్ని కిందికి దింపాడు. వెంటనే 108 సిబ్బందికి సమాచారమందించగా వచ్చి నర్సింహ మృతి చెందినట్టు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.


నర్సింహ(ఫైల్)

మా కులమేది..!

● కుల ధ్రువీకరణకు నోచని పిట్టల కులస్థులు
● సర్టిఫికెట్ లేక ఉద్యోగాలు వచ్చినా.. నియామకాలు కాలే..
● కల్యాణలక్ష్మికీ అనర్హత
● స్కూల్‌లో, కుటుంబ సర్వేలో ఖాళీగా కాలం

రిజిస్టర్‌లో ఖాళీగా ఉంచుతున్నాం



మా స్కూల్‌లో చదువు కుంటున్న పిట్టల కులస్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయడంలేదు. దీంతో అడ్మిషన్ రిజిస్టర్‌లో ఆ కాలం ఖాళీగా ఉంచుతున్నాం.

- జయప్రకాశ్, హెచ్‌ఎం, పిట్టలవాడ పాఠశాల

సర్వేలో కులం పేరు రాయలేదు..



సమగ్ర కుటుంబ సర్వేలో ఈ గ్రామస్థుల సరైన కులం లేనందున కాలం ఖాళీగా వదిలి వేశాం. ఇక్కడి వారు మాత్రం తాము నక్కల-32 (ఎస్టీ) కులస్థులుగా చెబుతున్నారు. సర్వే జాబితాలో, ఫారాల్లో పిట్టల కులం గురించి లేదు. దీంతో ఖాళీగా వదిలేశాను.

-అన్వర్ జహాన్, పిట్టలవాడలో సర్వే నిర్వహించిన ఎన్యుమరేటర్


ఇంటర్ చదివి ఇంటివద్దనే ఉంటున్నా..



ఇంటర్మీడియట్ చదువు కున్నాను. కుల ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో పైచ దువులకు వెళ్లలేకపోయా. నాతో పాటు చాలా మంది చదువులకు, ఉద్యోగాలకు దూరంగా ఉన్నారు. అధికారుల చుట్టూ తిరు గుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.

- పిట్టల గంగ, పిట్టలవాడ

తూప్రాన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామపంచాయితీ పరిధి పిట్టలవాడ గ్రామానికి చెందిన పిట్టలవారు ఉంటున్న ఊరిని గుర్తించారు. కానీ, వారిది ఏ కులమనేది మాత్రం ఇప్పటికీ ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించలేదు. దీంతో ఆ కులస్థులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు అంతేకాదు.. ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చినా కుల సర్టిఫికెట్ లేక నియామకం సమయంలో వీరిని అధికారులు తిరస్కరిస్తున్నారు. మొదటి నుంచే పిట్టలవారి విద్య సర్టిఫికెట్లల్లో కులం అనే కాలం ఖాళీగా వదిలేస్తుండగా.. ఇప్పుడు సమగ్ర సర్వేలోనూ ఆ కాలం ఖాళీగానే వదిలేస్తుండడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పాఠశాల రిజిస్టర్‌లో ఖాళీగా ఉన్న కులం కాలం

46 కుటుంబాలు..

దశాబ్దాల క్రితం పిట్టల కులస్థులంతా ఒకే చోట నివసిస్తుండటందో ప్రభుత్వం ఆ గ్రామాన్ని పిట్టల వాడగా గుర్తింపు ఇచ్చింది. అప్పట్లో పెద్ద ఎత్తున నివాసం ఉండగా.. చాలా మంది ఉపాధి కోసం వలస వెళ్లడంతో ప్రస్తుతం ఆ గ్రామంలో 46 కుటుంబాలు.. సుమారు 150 మంది జనాభా ఉన్నారు. అటవీ ప్రాంతంలో నివసించే వీరి భాష లంబాడీ భాషకు దగ్గరగా ఉంటుంది. జంతువులను వేటాడి జీవనోపాధి పొందేవారు. అయితే, వేట నిషేధం కావడం.. కొందరిపై కేసులు నమోదు కావడంతో ఆ వృత్తిని వదిలి ఆ ఊరి వారంతా ఇప్పుడు రోడ్ల పక్కన పండ్లు, మొక్కజొన్న కంకులు, కూరగాయలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. అంతా బాగానే ఉన్నప్పటికీ తాము పిట్టల కులస్థులుగా చెప్పుకుంటున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం వారిని అధికారికంగా పిట్టల కులస్థులుగా గుర్తించలేదు. ఈ మేరకు వారికి ధ్రువీకరణ పత్రాలూ జారీ చేయడం లేదు.

ఉద్యోగాలకూ దూరం..

కుల ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో వారి పిల్లలు చదువులకు, ఉద్యోగాలకు దూరం అవుతున్నారు. పిట్టలవాడలో ప్రభుత్వ పాఠశాల ఉండటంతో ఇక్కడ చదివే విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో అడ్మిషన్ రిజిస్టర్‌లో కులం రాయాల్సిన కాలం ఖాళీగా వదిలేస్తున్నారు. గ్రామానికి చెందిన శివ, అమరావతి, విజయ్, సుబ్బలక్ష్మిలు ఎస్టీలు పేర్కొంటూ దరఖాస్తులు చేసుకుని, పోలీసు ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. నియామకం సమయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లలో కుల ధ్రువీకరణ లేకపోవడంతో వీరి నియామకాలు రద్దయ్యాయి. ఇందులో సుబ్బలక్ష్మి నెల రోజుల పాటు పోలీస్ శిక్షణ పూర్తి చేసినప్పటికీ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ సమర్పించకపోవడంతో వెనక్కి వచ్చినట్లు గ్రామస్థులు చెప్పారు. పలువురు ప్రాథమిక విద్యను అభ్యసించి కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ లేకపోవడంతో అక్కడితో చదువు ఆపేయాల్సి వచ్చింది. ఇక ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా వారికి అందడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా కుల గణన కోసం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేలో సైతం పిట్టల కులస్తులకు న్యాయం జరగలేదు. సర్వే పత్రాల్లో పిట్టల కులస్థుల కాలం లేదని ఎన్యుమరేటర్లు వివరించారు. దీంతో ఈ కాలంలో ఖాళీగా వదిలివేశారు.

అధికారుల వద్దకు ముప్పయి సార్లు వెళ్లాను



పిట్టల కులస్థులకు కుల ధృవీకరణ పత్రాల కోసం అధికారుల వద్ద 30 సార్లు వెళ్లాను. కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దారులను కలిశాను. ఎంత మంది అధికారులను కలిసిన కులం నిర్ధారణ చేయడంలేదు. పక్కనే ఉన్న సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలలో ఎస్టీలుగా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు. ఇక్కడే పట్టించుకోవడంలేదు.

- పంజా బిక్షపతి, దండుపల్లి

అధికారులకు నివేదిక పంపారు



పిట్టలవాడకు చెందిన పిట్టల కులస్థులకు గతం నుంచే కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయ డంలేదు. వాళ్ల విజ్ఞాపనతో విచారణ చేసి గతంలో నివేదికను కలెక్టర్‌కు పంపారు. కలెక్టర్ నుంచి నివేదికను ప్రభుత్వానికి నివేదించారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే ధ్రువీక రణ పత్రాలు జారీ చేస్తాం. అధికారుల నుంచి ఆదేశాలు జారీ చేయకపోవడంతో ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలేదు.

-చంద్రశేఖర్‌రెడ్డి, మనోహరాబాద్ తహసీల్దార్



అంతారం గ్రామంలోని విఠలేశ్వర ఆలయం

నేటి నుంచి అంతారం జాతర

● ముస్తాబైన పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయం

మునిపల్లి, నవంబరు24 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం అంతారం గ్రామంలో శ్రీశ్రీశ్రీ జీవన్ముక్త మహారాజ్ జాతరకు వేళ అయ్యింది. ఈ నెల 25 నుంచి 29 వరకు జరిగే ఈ ఉత్సవాలకు పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. అందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ పీఠాధిపతి జ్ఞానేశ్వర (బాల్‌రాజ్) మహారాజ్ తెలిపారు. 25న శిఖరస్థాపన, 26న గురడవాహనము, 27న మహాపూజ, 28న గోపాళ్‌కాల, 29న రథోత్సవం తదితర పజా కార్య క్రమాలు ఉంటాయని తెలిపారు. విద్యుత్ కాంతులతో ఆలయం కాంతులు విరజిమ్ముతుండడంతో రథోత్సవానికి రథాన్ని సిద్ధంగా ఉంచారు.

ఆలయ ప్రత్యేకత..



పాండు రంగా విఠలేశ్వర స్వామి ఆలయానికి ఓ ప్రత్యేకత ఉంది. అందోల్ నియోజకవ ర్గంలో ఓ పార్టీకి చెందిన ఎమ్మెల్యే అభ్యర్థులు ఎన్నికల ప్రచారం షురూ చేసే ముందు స్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించడం ఆనవాయితీ. అయితే బరిలో నిలిచి గెలుపొందిన ఏ ఎమ్మెల్యే అయినా ఈ దేవాలయానికి వచ్చి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ అంతారం గ్రామాన్ని దేవుడి అంతారంగా కూడా అని పిలు స్తారు. ఈ ఆలయానికి వచ్చేందుకు సదాశివపేట నుంచి బుదేరా, కంకోల్ గ్రామం మీదుగా అంతారం గ్రామానికి చేరుకోవచ్చు. ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా కలదు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌక ర్యాలు కల్పించినట్లు ఆలయ పీఠాధిపతి జ్ఞానేశ్వర్ (బాల్‌రాజ్) మహారాజ్ తెలిపారు. ఈ ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలనిఆయన కోరారు.

వైభవంగా సుదర్శన నారసింహ యాగం



యాగం నిర్వహిస్తున్న పురోహితులు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి శివారు లోని శ్రీవైకుంఠపురం దేవాలయంలో మహా మండలార్చన ప్రయుక్త సుదర్శన నారసింహ యాగాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన యాగం సాయంత్రం 4 గంటల వరకు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కందాడై వరదాచార్యులు సమక్షంలో వైభవంగా యాగాన్ని జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర సతీమణి పద్మిణిరెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి విచ్చేసి యాగాన్ని వీక్షించారు. సుమారు 400 మంది భక్తుల జంటలు యాగంలో పాల్గొన్నాయి.

సాఫ్ట్‌బాల్ టోర్నీ రన్నరప్ మెదక్

● ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు
● విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి : డీఈవో

మాసాయిపేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని డీఈవో రాధాకిషన్‌రావు అన్నారు. మాసాయిపేట మండల కేంద్రంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల సాఫ్ట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలతో శారీరక, మానసిక వికాసం సిద్ధిస్తుందని అన్నారు. ఉన్నత లక్ష్యాలను చేరేందుకు క్రీడలను మెట్లుగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. నర్సాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. అనంతరం సాఫ్ట్ బాల్ పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులను ప్రదానం చేశారు. నిజామాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలువగా, మెదక్ రెండవ, మంచిర్యాల మూడవ స్థానంలో నిలిచాయి. ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ నుంచి శోభన్ బాబు, రేణుక, అభిషేక్ గౌడ్, క్రీడా కార్యదర్శి రమేశ్, ఉపాధ్యాయులు, దర్మపురి, రంగారెడ్డి, హరిరంజన్ శర్మ, శ్యాం సుందర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



గెలిచిన జట్లకు బహుమతుల ప్రదానం

కూలిన ఇంటి పైకప్పు

● త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



కూలిన ఇంటి కప్పు

గజ్వేల్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అకస్మాత్తుగా ఇంటి పైకప్పు కూలింది. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన బక్కయల మహిపాల్ దంపతులు శనివారం ఇంట్లో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి 1 గంటల సమయంలో అకస్మాత్తుగా ఇంటి పైకప్పు గోడ కూలి వారిపై పడింది. చుట్టుపక్కవారు నిద్రలేచి.. వారిని కాపాడారు. దాదాపు 15 నిమిషాల పాటు దంపతులిద్దరూ మట్టిలో కూరుకుపోయారు. భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సమయంలో పిల్లలు వేర్వేరు గదుల్లో పడుకోవడంతో పెను ప్రమాదం తప్పింది.

రాజ్యాంగాన్ని మార్చే కుట్రలను తిప్పికొట్టాలి

● రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మెదక్, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగం ద్వారానే బానిస బతుకులకు విముక్తి కలిగిందని, ప్రస్తుతం ఆ రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రతికూల శక్తులు కుట్రలు చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) ఆధ్వర్యంలో 75 ఏళ్ల భారత రాజ్యాంగ ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రసంగించారు. కుల వివక్ష, నేరాలకు పాల్పడిన వారికి శిక్షలు వేయడం రాజ్యాంగం ద్వారానే సాధ్యమైందన్నారు. దేశానికి రెండవ రాజ్యాంగం ఉండాలని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ముందు చూపుతో ఆనాడే ప్రతిపాదించారని గుర్తు చేశారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పీ.శంకర్ మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావం, సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని భారత రాజ్యాంగం దేశ పౌరులకు అందించిందన్నారు. కోట్లాది మంది అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవాలను పండగలా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఈ ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. టీఎస్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా సమాజంలో నేటికీ కుల వివక్ష కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగ నియామకాల్లో మాత్రమే రిజర్వేషన్లు అమలవుతున్నాయని, రాజకీయాల్లో కూడా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి ఎకరా స్థలం కేటాయించాలని చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా సంఘనేత జెల్లా సుధాకర్, సీనియర్ జర్నలిస్టు బొందుగుల నాగరాజు, జిల్లా కార్యదర్శి దయాసాగర్, అహ్మద్, బ్యాగరి వేణు, శ్రీనివాస్, న్యాయవాది సిద్దిరాములు, నర్సింగ్‌రావు, రాధాకిషన్, దుబాషి సంజీవ్, బాబు, నాయక్, మందుగుల గంగాధర్, బాల్‌రాజ్ గౌడ్, వెంకన్న, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

● పలు ట్రాన్స్‌ఫార్మర్లలో కాయిల్స్, ఆయిల్ చోరీ
● నిందితులపై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు
● వివరాలు వెల్లడించిన గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి

రాయపోల్/గజ్వేల్ నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్, ఆయిల్ దొంగతనం చేస్తున్న నలుగురు అంతర్రాష్ట్ర దొంగలను రాయపోల్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఆదివారం రాయపోల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి వివరాలను వెల్లడించారు. రామారం గ్రామ శివారులో ఉదయం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నలుగురు వ్యక్తులు కారులో అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా నేరాలు బయటపడ్డాయి. హర్యానా రాష్ట్రానికి చెందిన జుబేర్‌ఖాన్, అర్షద్, రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన పజర్, జాహిద్‌లు ఎక్స్‌కవేటర్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వీరు దూరంగా వ్యవసాయ పొలాలు, రోడ్డు పక్కన ఉండే ట్రాన్స్‌ఫార్మర్లే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. వాటి నుంచి కాయిల్స్, ఆయిల్ చోరీ చేస్తున్నారు. నిందితులపై జిల్లావ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో కేసులున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేయడానికి గడ్డపార, పాణాలు వారి కారులో లభించాయి. అయితే ఈనలుగురు నిందితులపై గతంలో చేగుంట మండలం మైనపేట గ్రామ శివారులో ఉన్న చైతన్య ఇండస్ట్రీస్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ దొంగతనం చేసిన కేసులో పోలీసులు అక్టోబరు 3న అరెస్టు చేసి జైలుకు పంపించగా అదేనెల 11న విడుదలయ్యారు. అప్పటి నుంచి మళ్లీ చోరీలకు పాల్పడుతున్నారు. ఆయిల్, కాయిల్స్‌ను తూప్రాన్ పట్టణంలోని ఆదేశ్ అనే వ్యక్తికి అమ్ముతున్నట్లు నిందితులు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి ఒక కారు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. చాకచక్యంగా కేసును ఛేదించిన పోలీసులకు అభినందించారు. కార్యక్రమంలో తొగుట సీఐ షేక్ లతీఫ్ రాయపోల్ ఎస్సై రఘుపతి, బేగంపేట ఏఎస్ఐ అమృత్, పోలీస్ సిబ్బంది మధుసూదన్ రెడ్డి, స్వామి, సత్యనారాయణ, సోమయ్య, కనకరాజు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

క్రైం కార్నర్

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం



నితిన్ (ఫైల్)

హత్నూర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన సంఘటన హత్నూర మండల పరిధిలోని మంగాపూర్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్ మండలం మాడాపూర్ గ్రామానికి చెందిన బేగరి నితిన్ (19) ఆదివారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై దౌల్తాబాద్ నుంచి స్వగ్రామమైన మాడాపూర్‌కు వెళ్తుండగా.. మంగాపూర్ గ్రామ శివారులోకి చేరుకోగానే లారీ ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యాపారి..



గంగాధర్ మృతదేహం

తూప్రాన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన చెప్పుల వ్యాపారి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన తూప్రాన్ పట్టణ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన మోచి గంగాధర్ (52) చెప్పులు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. శనివారం వెల్దుర్తి వారాంతపు సంతలో చెప్పులు విక్రయించి రాత్రి ఇంటికి ఆటోలో వెళ్తున్నాడు. తూప్రాన్ పట్టణ శివారులోని నాగులపల్లి హైవే బ్రిడ్జి వద్ద డ్రైవర్ నిర్లక్ష్యంతో ఆటో రాయిపైకి ఎక్కడంతో ఆటోలో ఉన్న గంగాధర్ కిందపడగా.. అతడిపై నుంచి ఆటో వెళ్లింది. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి కుమారుడు ప్రేమ్‌దాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గృహిణి ఆత్మహత్య

దౌల్తాబాద్,నవంబర్24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఇమ్మడి కిషన్ ఆర్‌ఎంపీ వైద్యుడిగా పని చేస్తున్నాడు. రెండేళ్ల క్రితం ఆయన భార్య మృతిచెందడంతో నిర్మల్ జిల్లాకు చెందిన ప్రవీణను వివాహం చేసుకున్నాడు. కొన్ని రోజులుగా డబ్బుల తేవాలని ఆమెను భర్త కిషన్ వేధింపులకు గురిచేస్తున్నాడు. మొదటి భార్య కొడుకు శ్రీనివాస్ అతని భార్య కారణంగా రోజూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రవీణ ఆదివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం కోసం తరలిస్తుండగా, మృతురాలి బంధువులు వచ్చే వరకు తీసుకెళ్లొదని స్థానికులు అడ్డుకున్నారు.

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

● అక్క కోసం పసికందు కిడ్నాప్..
● అనంతపూర్ నుంచి వచ్చి నిలోఫర్ వద్ద ఎత్తుకెళ్లిన వైనం
● కర్నూల్ హైవేపై ముగ్గురు నిందితుల అరెస్ట్
● చిన్నారిని తల్లికి అప్పగించిన అధికారులు

మంగళ్‌హాట్, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): నిలోఫర్ ఆస్పత్రి వద్ద కిడ్నాప్‌నకు గురైన పసికందు కథ సుఖాంతమైంది. తెలంగాణ రాష్ట్ర సరిహద్దులను దాటించక ముందే పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన హసీనాబేగం, గఫార్ దంపతులకు 45రోజుల బాబు ఉన్నాడు. కామెర్లు రావడంతో చిన్నారిని నిలోఫర్‌లో అడ్మిట్ చేశారు. ఆరోగ్యం కుదుటపడడంతో శనివారం వైద్యులు డిశ్చార్జ్ చేశారు. శనివారం సాయంత్రం నిలోఫర్ నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో ఓ గుర్తుతెలియని మహిళ వద్దకు వచ్చి తాను ఈ ఆస్పత్రిలోనే పనిచేస్తానని పరిచయం చేసుకుంది. ఇంతలో సంతకం చేయాలని హసీనాను ఆమె తల్లి పిలవడంతో అక్కడున్న మహిళ నీవు సంతకం పెట్టి రా.. మీ బాబును నేను చూసుకుంటానని చెప్పింది. చిన్నారి తల్లి తిరిగి వచ్చేలోపు ఆ మహిళ కనిపించకపోవడంతో నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీల నిందితులు కర్నూల్ జిల్లా వైపు వెళ్తున్నట్లు గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. ఉన్నతాధికారులు సూచనల మేరకు ఎస్ఐలు నాగరాజు(అలంపూర్ పీఎస్), చంద్రకాంత్(మానవపాడ్ పీఎస్), మహేష్‌గౌడ్ (ఉండవల్లి పీఎస్) తమ సిబ్బందితో కలిసి అదేరోజు రాత్రి 10.30 గంటల సమయంలో పుల్లూర్ టోల్‌గేట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఏపీ 28 ఏపీ 0785 నంబర్ గల ఓమ్నీ వ్యాన్ అటుగా రాగా అందులో ముగ్గురు చిన్నారులతోపాటు బురఖా ధరించిన ఇద్దరు మహిళలు, ఓ వ్యక్తి ఉన్నట్లు గుర్తించి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. నిలోఫర్ వద్ద కిడ్నాప్‌కు సంబంధించిన ఫొటోలతో సరిచూడగా నిందితులతో పాటు కిడ్నాప్‌నకు గురైన బాబు అందులోనే ఉండడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు.




నిందితులు షహినా బేగం, అబ్దుల్లా

అక్క కోసం కిడ్నాప్...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపూర్ మేకల చెరువు ప్రాంతానికి చెందిన అబ్దుల్లా అలియాస్ వెంకటేష్, రేష్మా అలియాస్ రేణుక దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు సంతానం ఉన్నారు. ప్రస్తుతం గర్భవతి అయిన రేణుక మళ్లీ ఆడపిల్లే పుడుతుందేమోనని ఆందోళన చెందేది. అయితే, రేణుక చెల్లి షహీన్ బేగం(28) అక్క కోరిక మేరకు ఓ బాబును ఎత్తుకొచ్చేందుకు సహకరిస్తానని ఒప్పుకుంది. పథకం ప్రకారం నిలోఫర్ ఆస్పత్రి వద్దకు షహీన్ బేగం తన బావ అబ్దుల్లా అలియాస్ వెంకటేష్‌తో చేరుకుంది. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన హసినాబేగం దృష్టి మరల్చి పసికందుతో ఆటోలో అక్కడి నుంచి పారిపోయారు. అనంతరం కొద్దిదూరం వెళ్లి తర్వాత ద్విచక్ర వాహనంపై జారుకున్నారు. వీరు కర్నూలు చేరుకునే లోపే నగర పోలీసులు అలంపూర్, మానవపాడ్, ఉండవల్లి పోలీసులను అప్రమత్తం చేశారు. ఓమ్నీ వ్యానులో వస్తున్న నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని నాంపల్లి పోలీసులకు అప్పగించారు. ఓమ్నీ వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు నిందితులు షహీన్ బేగం, అబ్దుల్లా, రేష్మా అలియాస్ రేణుకలను అరెస్ట్ చేసినట్లు సైఫాబాద్ ఏసీపీ తెలిపారు. బాబును సురక్షితంగా తల్లికి అప్పగించినట్లు తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

మిరుదొడ్డి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మిరుదొడ్డి ఎస్ఐ పరుశురాములు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దచెప్యాలకు చెందిన ఎండీ సయ్యద్‌అలీ (40) అనే వ్యక్తి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తిచెంది ఈనెల 22 ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి హైద్రాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు ఎస్ఐ తెలిపారు.


'ప్రభుత్వమే కొనుగోలు చేయాలి'

గజ్వేల్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో దళారులు లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జిల్లా కిసాన్‌మోర్చా కార్యదర్శి మర్కంటి ఏగొండ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

లీజ్ డబ్బు వసూలులో నిర్లక్ష్యమేలా?

- ఏడు నెలలు గడుస్తున్నా పట్టింపేలేదు
- ఆలయ ఆదాయానికి గండి

చేర్యాల, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్ లీజ్ డబ్బుల వసూలులో ఆలయవర్గాలు జాప్యం వహిస్తుండటం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆలయానికి ఆదాయం సమకూరే విషయమై నప్పటికీ ఏమాత్రం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆలయ పరిధిలోని టీటీడీ సత్రం ఆవరణ నుంచి రాతిగీరెల వరకు 26 దుకాణాలున్నాయి. వీటిని లీజుకు ఇవ్వడానికి గతంలో సంవత్సరం ప్రాతిపదికన వేలం నిర్వహించేవారు. కానీ జాతర జరిగే మూడునెలలపాటు వ్యాపారం కొనసాగినా, మిగతా రోజుల్లో గిట్టుబాటు కాక ఇబ్బందులు పడుతున్నామని పలువురు వేలంలో పాల్గొనకపోవడంతో ఆదాయానికి గండిపడుతూ వచ్చేది.



ఆలయ ఆవరణలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలు

ఏడు నెలలు గడుస్తున్నా వసూళ్లేవీ

కొన్నాళ్లక్రితం మూడు సంవత్సరాల లీజు ఇవ్వడానికి చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా షాపు నెం.1-20 వరకు ఏటా రూ.75వేలు, షాపు నెం.21-26వరకు రూ.95వేలు చొప్పున లీజుకు ఇచ్చారు. ప్రతీ ఏటా ఏప్రిల్ మొదటి వారంలోగా లీజుడబ్బులు వసూలు చేయాల్సి ఉంటుంది. అందులో భాగంగా ప్రస్తుత 2024-25 సంవత్సరానికి సంబంధించిన డబ్బులు గత ఏప్రిల్ మాసం ప్రారంభంలోనే వసూలు చేయాల్సి ఉంది. కానీ ఇప్పటికీ ఏడు నెలలు గడుస్తున్నా వసూలులో ఆలయవర్గాల నిర్లక్ష్యం వహిస్తున్నాయి. అంతేకాక గతేడాది లీజు డబ్బులు చెల్లించని వారికి మళ్లీ అవకాశం ఇవ్వకూడదు. నెలరోజుల్లో మల్లన్న కల్యాణంతో జాతర ప్రారంభం కానున్న తరణంలో ఇకనైనా లీజుడబ్బులు వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పోస్ట్ డేటెడ్ చెక్కు మాయం?!

ఎల్లమ్మ ఆలయ గుట్టపై ఓ విభాగానికి నిర్వహించిన వేలం దక్కించుకున్న ఓ టెండర్‌దారుడు దాఖలు చేసిన పోస్ట్ డేటెడ్ చెక్కు అందుబాటులో లేకపోవడంతో మాయం చేశారన్న ప్రచారం సాగుతుంది. ఈ విషయాన్ని ఆలయాధికారులు ఆలస్యంగా గుర్తించినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంపైనా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై ఈవోను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

మహనీయుల విగ్రహాల ఏర్పాటు హర్షణీయం

- ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి

గజ్వేల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశభక్తిని పెంపొందించేందుకు మహనీయుల విగ్రహాల ఏర్పాటు హర్షణీయమని ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఆదివారం ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయోద్దీన్, ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌తో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహనీయుల విగ్రహాల ఏర్పాటుతో భవిష్యత్తు తరానికి వారి త్యాగాన్ని వివరించేందుకు దోహదపడుతుందన్నారు. వారివెంట కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్, ఉప్పల మెట్టయ్య, బోగ్గుల చందు, మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్, నాయకులు గంగిశెట్టి రవీందర్, నవాజ్ మీరా, మాదాసు తదితరులున్నారు.



సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాసంకల్ప దీక్షను విజయవంతం చేయాలి

- డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30వతేదీన చేర్యాల పట్టణంలో నిర్వహించే ప్రజాసంకల్ప దీక్ష విజయవంతానికి పార్టీ శ్రేణులు జేఏసీకి మద్దతుగా నిలవాలని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కోరారు. పట్టణంలోని ఆయన నివాసంలో ఆదివారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేర్యాల ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా వ్యవహరించి విచ్ఛిన్నం చేసి ఈప్రాంత వెనకబాటుకు కారణమైందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శ్వేత, మండలాధ్యక్షుడు కొమ్ము రవి, కౌన్సిలర్ ఆడెపు నరేందర్, నాయకులు పుర్మ ఆగంరెడ్డి, మంచాల చిరంజీవులు, కొమ్ము నర్సింగరావు, దాసరి శ్రీకాంత్, ముస్త్యాల యాదగిరి, కర్క సంతోశ్‌రెడ్డి, తోళ్ల రాజేశ్వరి, వంగ జయలక్ష్మి, రేకులపల్లి విజయతదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ ఆదివారం వినతిపత్రం అందించారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు.

చన్నీటి స్నానం. చలితో సావాసం

5వ పేజీ తరువాయి..

జాప్యం జరుగుతోంది. మరికొన్ని హాస్టళ్లలో మంచాలు లేక నేలపైనే నిద్రిస్తున్నారు. ఇలా అనేక సమస్యలు 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వెలుగులోకి వచ్చాయి.

- మద్దూరు మండలంలోని కస్తూర్బా పాఠశాలలో సోలార్ వాటర్ హీటర్ పనిచేయక విద్యార్థులు చన్నీటితో స్నానాలు చేస్తున్నారు.
- బెజ్జంకి ఎస్సీ హాస్టల్‌లో రగ్గులు, స్వెటర్లు పంపిణీ చేయలేదు. గతేడాది ఇచ్చిన వాటినే వాడుతున్నారు. దుప్పట్లు లేక చేతులు, కాళ్లు ముడుచుకొని పడుకుంటున్నారు.
- చిన్నకోడూరు బీసీ హాస్టల్‌లో 82 మంది విద్యార్థులు ఉన్నారు. వేడినీటి సౌకర్యం లేక చన్నీటితో స్నానాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.
- సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి ఎస్సీ గురుకుల పాఠశాలలో మంచాలు లేక నేల మీదనే నిద్రిస్తున్నారు. 639మంది విద్యార్థులున్న గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలోనూ చన్నీటి స్నానాలే చేయాల్సి వస్తోంది.



గజ్వేల్ ఎస్టీ బాలుర వసతి గృహ భవనం స్లాబ్ పెచ్చులూడుతున్న దృశ్యం

- ములుగు మండలం తునికి బొల్లారంలోని కస్తూర్బా హాస్టల్‌లో కిటికీలు, తలుపులు సరిగా లేవు. ప్రతీసారి చలికాలం ముందు దుప్పట్లు ఇచ్చేవారని, ఈసారి ఇవ్వకపోవడంతో ఇంటి నుంచి తెచ్చుకున్నామని విద్యార్థులు తెలిపారు.
- హుస్నాబాద్‌లోని గిరిజన గురుకుల పాఠశాలలో దుప్పట్లు ఇవ్వలేదు. హుస్నాబాద్ బాలుర బీసీ హాస్టల్‌లో చన్నీటి స్నానం చేయలేకపోతున్నామని, వాటర్ హీటర్ ఇప్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.
- నంగునూరు మండలం పాలమాకుల ఎస్సీ బాలర హాస్టల్‌లో గతేడాది ఇచ్చిన దుప్పట్లు, స్వెటర్లనే విద్యార్థులు వినియోగిస్తున్నారు.
- గజ్వేల్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహంలో దుప్పట్లు, స్వెటర్లు ఇవ్వలేదు. మరుగుదొడ్లకు, గదులకు తలుపులు, కిటికీలు సరిగా లేవు. శ్లాబ్ పెచ్చులు ఊడుతున్న క్రమంలో విద్యార్థులు భయానికి లోనవుతున్నారు.

దృష్టిసారించాల్సిన సమయం..

హాస్టళ్లలో సరైన వసతులు లేకపోవడం వల్ల ప్రతీ ఏడాది చలికాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దుప్పట్లు, బ్లాంకెట్లు కొన్నిచోట్ల పంపిణీ చేశారని, ఇంకొన్ని హాస్టళ్లలో ఇవ్వలేదన్నట్లుగా పరిస్థితులు రుజువు చేస్తున్నాయి. చాలా హాస్టళ్లలో గతేడాది ఇచ్చిన దుప్పట్లు, స్వెటర్లనే వినియోగిస్తున్నారు. చలితీవ్రత పెరగడం వల్ల చన్నీటి స్నానాలు చేయలేకపోతున్నారు. కొన్నిహాస్టళ్లలో మాత్రమే సోలార్ హీటర్లు పనిచేస్తున్నాయి. అక్కడక్కడా కట్టెల పొయ్యి మీద వేడినీళ్ల కాచి ఇస్తున్నారు. ఇక మెజార్టీ హాస్టళ్ల, గురుకులాల్లో చన్నీటి స్నానాలతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. చలి తీవ్రత, చన్నీటి స్నానం, దోమల వల్ల విద్యార్థులు జ్వరంతో బాధపడుతున్నారు. ఫలితంగా తరగతులకు హాజరుకాలేకపోతున్నారు. ఈ ప్రభావం వారి చదువుపై పడుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లపై ప్రభుత్వంతోపాటు అధికార యంత్రాంగం దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వర్గల్ బీసీ హాస్టల్‌లో స్వెటర్లు లేకుండా చదువుకుంటున్న విద్యార్థులు

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

మిరుదొడ్డి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిద్దిపేట అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. మండలంలోని అల్వాల సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను, మిరుదొడ్డిలోని ఆదర్శ పాఠశాలను, కస్తూర్బా గాంధీ పాఠశాలలను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ హరికిషన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

- గజ్వేల్/గజ్వేల్ రూరల్: ఎస్టీ విద్యార్థుల హాస్టల్ సమస్యలు పరిష్కారంలో నిర్లక్ష్య, వివక్ష వైఖరి విడాలని డీబీఎస్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఎస్టీ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టల్ స్లాబ్ పెచ్చులూడుతుండడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. బాత్‌రూం డోర్లు విరగడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఆయనవెంట డీబీఎఫ్ నాయకులు ఉన్నారు.



మిరుదొడ్డి కస్తూర్బాలో విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నిధులు మంజూరు చేయాలి

- కేంద్ర సహాయ మంత్రికి బీజేపీ నాయకుల వినతి

కోహెడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 27 గ్రామాలకు వివిధ అభివృద్ధి పనులకు ఈజీఎస్ గ్రాంట్ నుంచి స్పెషల్ నిధులు మంజూరు చేయించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు ఆదివారం కరీంనగర్‌లో మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం ఆధ్వర్యంలో నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావు, బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా బీజేవైఎం మాజీ ఉపాధ్యక్షుడు మామిడి కరుణాకర్ తదితరులున్నారు.

మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు



మంత్రికి పుష్పగుచ్చం అందజేస్తున్న సభ్యులు

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 24) ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఏర్పాటుకు కృషి చేసిన రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన క్యారాలయంలో పాలకవర్గం సభ్యులు కలిసి పుష్పగుచ్చం అందించి కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఏర్పడిన పాలక వర్గం చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, వైస్‌చైర్మన్ బంక చందు, పాలక వర్గం సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

మొక్కలు నాటిన ఏసీపీ, సీఐ

సిద్దిపేట అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సేవ్ ఎర్త్ సేవ్ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల సమీపంలోని 3 టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సిద్దిపేట ఏసీపీ మధు, త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్లు విద్యాసాగర్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది. సేవ్‌ఎర్త్‌సేవ్ లైఫ్ ఫౌండర్ పీఎస్ యాదగిరి, రాజలింగం పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఏసీపీ మధు, త్రీటౌన్ సీఐ విద్యాసాగర్

'నేటి బీసీ సదస్సుకు తరలిరావాలి'

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నేడు నిర్వహించే బీసీ సదస్సుకు బీసీ యువజనులంతా కదలిరావాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగ్గోజు సుదర్శనచారి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జనగణనలో భాగంగా కులగణన చేపట్టాలని, పార్లమెంట్‌లో బిల్లుపెట్టి, చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పంచాయితీల పరిష్కారానికి అడ్డాగా ప్రయాణ ప్రాంగణం



ప్రయాణికుల సౌలభ్యం కోసం మండల కేంద్రంలో నిర్మించిన ప్రయాణ ప్రాంగణం పంచాయితీలకు అడ్డాగా మారింది. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ రోడ్డులో బస్టాండ్ నిర్మించారు. కానీ ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో నిర్మించిన బస్టాండ్ వైపు నామమాత్రంగా ఒక బస్సు అప్పుడప్పుడు వస్తుంటుంది. దీంతో ప్రజలు మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో పోలీస్‌స్టేషన్, తసహీల్దార్ కార్యాలయానికి వచ్చే పలువురు ఫిర్యాదుదారుల పంచాయితీలకు బస్టాండ్ అడ్డాగా మారుతున్నది. ప్రతిరోజు బస్సులు నిలిపి ప్రయాణ ప్రాంగణాన్ని అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. - బెజ్జంకి

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

- కార్తీక మాసం కావడంతో పెరిగిన తాకిడి

చేర్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామిని ఆదివారం భక్తులు భారీగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కు బడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. సంప్రదాయబద్ధంగా మట్టికుండలో బోనం చేసి భక్తిప్రపత్తులతో చలక, నజరు, ముఖ మండప పట్నాలువేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లం పానకం సాకపెట్టి ఒడిబియ్యాలు పోశారు. ఈవో బాలాజీశర్మ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పూజలు చేసిన జైళ్లశాఖ ఐజీ

రాష్ట్ర జైళ్లశాఖ ఐజీ మురళిబాబు కుటుంబసమేతంగా మల్లన్నను దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం అర్చకులు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో సూపరింటెండెట్ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ రాజు పాల్గొన్నారు.

- వర్గల్: నాచగిరి లక్ష్మీనృసింహ్మస్వామి క్షేత్రంలో కార్తీక మాసం చివరి ఆదివారం కావడంతో క్షేత్రానికి భక్తులు అధికంగా తరలివచ్చారు. కార్తీకమాసం సందర్భంగా నాచగిరి క్షేత్రానికి భక్తులు తెల్లవారుజామునే చేరుకున్నారు. ఆలయ పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ అన్నపూర్ణ, ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. నాచగిరి క్షేత్రంలో ఆలయ మండపం వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్ద భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.



చేర్యాల: జైళ్లశాఖ ఐజీ మురళిబాబుకు మల్లన్న ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

వర్గల్ మండల కేంద్రంలోని స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం జరగనున్న శ్రీ పూర్ణ పుష్కలంబ సమేత శ్రీ హరిహర పుత్ర అయప్ప స్వామి మహా పడిపూజకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

- చేర్యాల: చేర్యాల పట్టణంలోని పెద్దచెరువు ఆవరణలోని మడేలయ్య ఆలయంలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు మూడోరోజు ఆదివారం ఘనంగా జరిగాయి. మహిళలు బోనం తయారుచేసి సంప్రదాయబద్ధంగా ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి నివేదించారు.



వర్గల్: నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక దీపోత్సవంలో భాగంగా కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ముఖమడపంలో శ్రీ ఆకారంలో దీపాలు వెలిగించారు.

- కొండపాక: కొండపాక ఆనంద నిలయం ఆవరణలోని అష్టాదశ శక్తి పీఠ సహిత ఉమా రామలింగేశ్వర స్వామి సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో దీపోత్సవం నిర్వహించారు.

హుస్నాబాద్‌లో నేడు ప్రజా విజయోత్సవాల కళాప్రదర్శన: కలెక్టర్ మనుచౌదరి

హుస్నాబాద్‌రూరల్,నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు 2024లో భాగంగా నేడు హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సాంస్కృతిక కళాప్రదర్శన నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ మనుచౌదరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు భారీగా పాల్గొనాలని కోరారు.

అనాలోచిత నిర్ణయాలతో ప్రాథమిక విద్య నిర్వీర్యం

- తపస్ రాష్ట్ర కార్యదర్శి నవాత్ సురేష్

సిద్దిపేట కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆనాలోచిత నిర్ణయాలతో ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తున్నదని, విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విధంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర కార్యదర్శి నవాత్ సురేష్ విమర్శించారు. సిద్దిపేటలోని ఓ ఫంక్షన్ హాల్లో తపస్ జిల్లా అధ్యక్షుడు ఊడెం రఘువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను సర్వే పేరుతో ప్రభుత్వం పాఠశాలకు దూరం చేసిందన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనాకర్‌రెడ్డి, రాష్ట్ర సభ్యులు మహేందర్‌రెడ్డి, జిల్లా సభ్యులు శశికుమార్, శ్రీనివాస్, కుమార్, స్వామిగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, కిష్టారెడ్డి, శ్రీకాంత్, రమేష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో ఎర్ర జెండాకు పూర్వవైభవం

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

సిద్దిపేట రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు కమ్యూనిస్టులపై ఆధారపడి ఉందని, భవిష్యత్తులో ఎర్ర జెండాకు పూర్వవైభవం రావడం ఖాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్లబండి శశిధర్ ధీమా వ్యక్తం చేశారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు చింతల వెంకయ్య అధ్యక్షతన ఆదివారం సిద్దిపేట రూరల్ మండల మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు పెద్దలకు అనుకూలమైన నిర్ణయాలు చేస్తూ పేదలను విస్మరిస్తున్నాయన్నారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, గిరిజనులు, పేదలు, మైనార్టీలు, మహిళలపై దాడులు పెరిగాయన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలలో ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని ఆరోపించారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి కనకయ్య, నాయకులు రెడ్డమైన అరవింద, యాదగిరి, ఎర్రోళ్ల నవీన్, మచందర్, రవి, తిరుపతి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

'భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించాలి'

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ఆమోదం పొంది నవంబరు 26తో 75 సంవత్సరాలు పూర్తి కానున్నది. ఈ సందర్భంగా రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించుకోవాలని రాష్ట్ర అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేప్యాల ప్రకాశ్ పిలుపునిచ్చారు. హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం రాజ్యాంగ పరిరక్షణ యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడారు. నవంబరు 26 సాయంత్రం హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్కతుర్తి నుంచి కార్లతో యాత్ర ప్రారంభమై భీమదేవరపల్లి, సైదాపూర్,అక్కన్నపేట, కోహెడ, చిగురుమామిడి మీదుగా హుస్నాబాద్ చేరుకుని అంబేడ్కర్ చౌరస్తాలో యాత్ర ముగింపు బహిరంగ సభ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి తూముల సదానందం, రాష్ట్ర కార్యదర్శులు తొందూరి ఎల్లయ్య, మేకల చేరాలు, కండె సుధాకర్, రాజమౌళి, మ్యాక రమేష్, గడిపె బాలు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి

- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

చిన్నకోడూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో డిసెంబరు 1న సికింద్రాబాద్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని పోరాట సమితి జిల్లా కన్వీనర్ గుడుమల్ల సత్తయ్య కోరారు. చిన్నకోడూరు మండల కేంద్రంలో ఆదివారం మాలల సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ కటికం రవి, పిట్ల మల్లేశం, పిట్ల కృష్ణ, అనిల్, వినయ్, సచిన్, నరసింహులు, ఎల్లయ్య, హనుమంతు, రాజయ్య, మల్లేశం, ప్రేమ్ చందు తదితరులు పాల్గొన్నారు.

- గజ్వేల్ రూరల్: 'హలో మాల చలో హైదరాబాద్' నినాదంతో డిసెంబరు 1న చేపట్టనున్న మాలల సింహగర్జన పోస్టర్‌ను కొడకండ్లలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ అరిగే ప్రవీణ్, భూమయ్య అరిగే అశోక్, ముత్యాల వేణుగోపాల్, చంద్రప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.
- నంగునూరు: నంగునూరులో మాలల సింహ గర్జన పోస్టర్‌ను మాల సంఘం మండల అధ్యక్షుడు దాసరి రమేశ్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సోషల్ మీడియా అధ్యక్షుడు రాగుల కృష్ణ, జిల్లా కన్వీనర్ నరసింహరావు, బడే రాజయ్య, రాగుల ఎల్లా దాసు, పులి రవి, మహేందర్, బడే సాంబయ్య, రాగుల అశోక్, నరేష్, ప్రమోదం, కల్లాటి రమేష్, కిషోర్, బోడ నాగరాజు, రమేష్, పెంటయ్య, సాయిశ్యామ్, బడే నరేష్, నీల చందు, ఎడ్ల అఖిల్, వినయ్, సంతు తదితరులు పాల్గొన్నారు.

పాత్ ఫైండర్ పోటీ పరీక్ష బ్రోచర్ ఆవిష్కరణ

కొండపాక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): లీడ్ లైఫ్ హ్యాపీలీ సంస్థ నిర్వహిస్తున్న పాత్ ఫైండర్ పోటీ పరీక్ష బ్రోచర్‌ను ఆదివారం జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. లీడ్ లైఫ్ హ్యాపీలీ సంస్థ వ్యవస్థాపకులు కోణం శ్రీకాంత్, శిరీష 6, 7, 8వ తరగతి విద్యార్థులకు గణితశాస్త్రంలో ఆలోచన విధానం పెంపొందించాలన్న ఉద్దేశంతో దీనిని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి రామస్వామి, నిర్వాహకులు కోణం శ్రీకాంత్, చంద్రం, బాలకృష్ణ, రమేష్, దేవేందర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొండపాక, నవంబరు 24 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో మండలంలోని సిరసనగండ్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు రేవంత్, అనిల్ అండర్ -14 బాలుర విభాగంలో తృతీయ బహుమతి సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్దవిఠల్ ఓ ప్రకటనలో తెలిపాడు.



రేవంత్, అనిల్

దొమ్మాట మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి మృతి

కొండపాక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దొమ్మాట మాజీ ఎమ్మెల్యే దొమ్మాట రామచంద్రారెడ్డి(79) ఆదివారం రాత్రి మృతి చెందాడు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. 2009లో కుమారుడి మృతి తర్వాత ఆర్థికంగా, మానసికంగా కుంగిపోయారు. 2017 జూన్ 8న ఆంధ్రజ్యోతిలో ఆయన దీనావస్థపై ప్రత్యేక కథనం కూడా ప్రచురితమైంది. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. అంత్యక్రియలు సోమవారం కొండపాకలో జరగనున్నాయని బంధువులు తెలిపారు. ఆయనకు భార్య ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

గజ్వేల్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యం అయిన సంఘటన మండల పరిధిలోని దాచారంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎల్లేశ్వరం నరసమ్మ తన ఇద్దరు కుమారులతో కలిసి 19న రిమ్మనగూడలో శుభకార్యాని వెళ్లింది. మరుసటి రోజు ఉదయం పెద్ద కుమారుడు మురళి(29) ఇంటికి వెళ్తున్నానని చెప్పాడు. అదే రోజున తల్లి, సోదరుడు ఇంటికి వెళ్లగా అతడు కనిపించలేదు. బంధువులు, తెలిసిన వారిని సంప్రదించినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం ఫిర్యాదు చేశారు.